ప్ర'జల' ప్రాణాలతో చెలగాటం

- నీటి సరఫరాలో కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యం
- జిల్లాలో విజృంభిస్తున్న అతిసారం
- తొమ్మిది నెలల్లో పది మంది మృతి
- తాజాగా ఆత్మకూరులో ఇద్దరి మృతితో కలకలం
- కలుషితం జలం సరఫరాపై ఫిర్యాదు చేసినా పట్టించుకోని మున్సిపల్ అధికారులు

సాక్షి, నంద్యాల: కలుషిత నీరు ప్రజల ప్రాణాలు కబళిస్తున్నా కూటమి ప్రభుత్వం చోద్యం చూస్తోంది. జిల్లాలో మంచినీటి సరఫరా వ్యవస్థ అధ్వానంగా మారి జనం రోగాల బారిన పడి ప్రాణాలు కోల్పోతున్నా పట్టనట్లు వ్యవహరిస్తోంది. 9 నెలల కూటమి పాలనలో జిల్లాలో పది మంది అతిసారం బారిన పడి మృత్యువాత పడ్డారు. మంచినీరు కలుషితం కాకుండా పకడ్బందీగా చర్యలు తీసుకోవడంలో విఫలమవుతోంది. ఉన్నతాధికారుల పర్యవేక్షణ లేక కింది స్థాయి సిబ్బంది నిర్లక్ష్యంతో ప్రజల ప్రాణాలు పోతున్నాయి. తాజాగా ఆత్మకూరు పట్టణంలోని నీలితొట్లవీధిలోఅతిసారం ప్రబలి ఇద్దరు మృతి చెందగా, మరో ఏడుగురు ఆసుపత్రి పాలయ్యారు. తాగునీరు కలుషితమై తీవ్ర దుర్వాసన వస్తోందని, బురుగు బురుగుగా నీళ్లు వస్తున్నాయని స్థానికులు అధికారులకు ఫిర్యాదులు చేశారు. వారం రోజులైనా వారు ఏమాత్రం పట్టించుకోలేదు. బుధవారం రాత్రి కలుషిత నీరు తాగడంలో సుమారు పది మంది తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. కొంత మంది స్థానిక ఆర్ఎంపీల దగ్గర మరి కొంతమంది పట్టణ ఆసుపత్రిలో చికిత్స కోసం వెళ్లారు. పరిస్థితి విషమంగా ఉండడంతో వీరిని కర్నూలు ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లాలని వైద్యులు సూచించారు. గురువారం చికిత్స పొందుతూ రాత్రి 9 గంటల సమయంలో ఇద్దరు రహంతుల్లా (45), బసిరూన్ (56) మృతిచెందారు. ఏడుగురి పరిస్థితి ఆందోళనకరంగానే ఉన్నట్లు బంధువులు చెబుతున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి గ్రామీణ నీటి సరఫరా వ్యవస్థ అటకెక్కింది. గ్రామాల్లో ఓవర్ హెడ్ ట్యాంకులు, జీఎల్ఎస్ఆర్, పీడబ్ల్యూఎస్ ట్యాంకుల శుభ్రత గాలికొదిలేశారనే విమర్శలు ఉన్నాయి.




ఆత్మకూరు నీలితొట్ల వీధిలో డ్రైనేజీ కాలువలో మంచి నీటి పైప్‌లైన్

ప్రాణాలు పోయాక..

వారం రోజుల నుంచి ప్రజలు ఫిర్యాదు చేస్తున్నా అధికారుల్లో చలనం లేకుండా పోయింది. తాగే నీరు తీవ్ర దుర్వాసనతో వస్తున్నాయని, బురదతో కూడిన బురుగు నీటిని తాగుతున్నామని నీలితొట్ల వీధి ప్రజలు అధికారులకు ఫిర్యాదు చేసినా ఏ ఒక్కరూ పట్టించుకున్న పాపాన పోలేదు. కలుషిత నీటిని తాగి గురువారం ఇద్దరు మృతి చెందారన్న తర్వాత అధికారులు ఉరుకులు పరుగులు పెట్టారు. గురువారం రాత్రి 10 గంటలకే డీఎంహెచ్ఓ, మున్సిపల్ కమిషనర్, స్థానిక రెవెన్యూ, పోలీసు అధికారులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. వీధిలో నిల్వ ఉన్న నీటిని ఖాళీ చేయించారు. అప్పటికప్పుడు ట్యాంకర్లతో నీటిని సరఫరా చేశారు. శాంపిల్స్ కోసం కలుషిత నీటిని వదిలేసి ట్యాంకర్ నీటిని తీసుకెళ్లారని స్థానికులు చెబుతున్నారు.

పూర్తి విరుద్ధంగా కలెక్టర్ ప్రకటన

దుర్వాసన, బురుగుతో కూడిన కలుషితమైన నీటిని తాగడం వల్లే ఇద్దరు చనిపోయారని మృతుల బంధువులు, ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితులు చెబుతుంటే.. ఇందుకు పూర్తి విరుద్ధంగా కలెక్టర్ రాజకుమారి ప్రకటన చేశారు. నీటితొట్ల వీధిలో నీరు కలుషితం కాలేదని తేల్చేశారు. గ్రామానికి సరఫరా చేసిన నీటికి సంబంధించి శాంపిల్స్ సేకరించి పరీక్ష చేయించామని, టెస్టుల్లో నెగటివ్ వచ్చిందని తెలిపారు. శుక్రవారం ఆత్మకూరు పట్టణంలోని నీటితొట్ల వీధిలో ఆమె పర్యటించారు. మున్సిపల్, రెవెన్యూ, వైద్య ఆరోగ్య సంబంధ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నీరు కలుషితమైనట్లు ఎక్కడా నిరూపణ కాలేదని, ప్రజలెవరూ భయపడాల్సిన అవసరం లేదన్నారు.

ట్యాంకు శుభ్రం చేయడం లేదు..



మా వీధిలో నీళ్ల ట్యాంకును కొన్ని నెలలుగా శుభ్రం చేయడం లేదు. తాగునీటిలో డ్రైనేజీ నీరు కలవడం వల్లే డయేరియా ప్రబలింది. ట్యాంకు నీళ్లు తాగిన వారంతా వాంతులు, విరేచనాలతో బాధపడుతున్నారు. అంతకు ముందే కలుషిత నీటిపై మున్సిపల్ సిబ్బంది దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదు.

– షేర్ అలి, నీలితొట్లవీధి, ఆత్మకూరు

ఎవరు బాధ్యత వహిస్తారు?



నేను, మా మామ రహంతుల్లా విరేచనాలు, వాంతులతో ఇబ్బంది పడ్డాం. స్థానికంగా ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స తీసుకున్నాం. తగ్గకపోవడంతో కర్నూలు పెద్దస్పత్రికి వెళ్లాం. అక్కడి వైద్యులు ఏమాత్రం పట్టించుకోలేదు. నేను కొద్దిగా కోలుకున్నా. మా మామ చనిపోయాడు. కంపు కొడుతున్న నీరు వస్తున్నాయని పది రోజుల నుంచి అధికారులకు చెబుతున్నా పట్టించుకోలేదు. ఇద్దరి మరణాలకు ఎవరు బాధ్యత వహిస్తారు.

– కాబెతుల్లా షేర్, మృతుడు రహంతుల్లా అల్లుడు, ఆత్మకూరు



కలుషితంగా వస్తున్న తాగునీరు

జిల్లాలో ఇలా..

- గతేడాది జూన్‌లో జూపాడుబంగ్లా మండలం చాబో లు గ్రామంలో అతిసారం ప్రబలి 20 మంది వరకు తీవ్ర అనారోగ్యానికి గురయ్యారు. చికిత్స పొందుతూ నడిపి నాగన్న అనే వ్యక్తి మృతి చెందాడు.
- గతేడాది ఆగస్ట్ చివరి వారంలో అతిసారంతో పాములపాడు మండలం వేంపెంట బీసీ కాలనీలో కలుషితమైన కుళాయి నీరు తాగి సుమారు 20 మంది గ్రామస్తులు తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. బోయ లక్ష్మీదేవి అనే మహిళ మృతి చెందింది.
- సెప్టెంబర్‌లో ఆళ్లగడ్డను అతిసారం వణికించింది. పట్టణంలోని ఆదర్శ అభ్యుదయ కాలనీలో సుమారు వంద మంది ఆసుపత్రి పాలయ్యారు. పది రోజుల్లో ఆరుగురు మృతి చెందారు.
- అక్టోబర్, నవంబర్‌లో నంద్యాల పట్టణంలోని ఎన్‌జీవో కాలనీ, సంజీవ నగర్ గేట్, మూలసాగరం, వన్ టౌన్ ప్రాంతాల్లో నీరు కలుషితమై కొందరు తీవ్ర అస్వస్థతకు గురయ్యారు.
- డిసెంబర్‌లో నంద్యాల పట్టణంలోని ఎన్‌జీవో కాలనీ లలితానగర్‌లో డ్రైనేజీలో మంచి నీటి పైప్‌లైన్ పగిలి నీరు కలుషితమవుతోందని అధికారులకు ఫిర్యాదు చేస్తే పది రోజులకు స్పందించారు.

క్లుప్తంగా

వైభవం..అమృతవల్లీ తిరుమంజనం



అమ్మవారికి తిరుమంజనం నిర్వహిస్తున్న దృశ్యం

ఆళ్లగడ్డ: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం అహోబిలంలో శ్రీ అమృతవల్లీ అమ్మవారి తిరుమంజనం ఉత్సవం శుక్రవారం వైభవంగా జరిగింది. ప్రతి ఏడాది బ్రహ్మోత్సవాలు ప్రారంభానికి ముందు వచ్చే శుక్రవారం ఆ ఏడాది చివరి శుక్రవారంగా పరిగణించడం ఆనవాయితీ. ఇందులో భాగంగా దిగువ అహోబిలం దేవాలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన యాగశాలలో ఉత్సవమూర్తి అమ్మవారిని కొలువుంచి నవకలశాలతో అభిషేకించి, అనంతరం తిరుమంజనం నిర్వహించారు. తర్వాత ప్రత్యేకంగా అలంకరించి మంగళగిరి ప్రభలో కొలువుంచి గ్రామోత్సవం నిర్వహించారు.

పారిశుద్ధ్య కార్మికులను రెగ్యులర్ చేయాలి



మాట్లాడుతున్న నాయకులు

నంద్యాల(న్యూటౌన్): పారిశుద్ధ్య కాంట్రాక్ట్ కార్మికులను రెగ్యులర్ చేయాలని, నిర్వహణ సాంఘిక భద్రత మున్సిపల్ శాఖకు పూర్తి బాధ్యతలు ఇవ్వాలని, జనాభా ప్రాతిపదికన బట్టి కార్మికుల సంఖ్య పెంచాలని ఏఐటీయూసీ జిల్లా నాయకులు శ్రీనివాసులు, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు రంజీత్, నాగరాముడు డిమాండ్ చేశారు. స్థానిక కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ రెగ్యులర్ ఉద్యోగుల వలే ఔట్‌సోర్సింగ్ కార్మికులకు పదవీ విరమణ వయస్సు 62 సంవత్సరాలకు పెంచాలన్నారు. ఈ డిమాండ్ల సాధనకు మార్చి 6వ తేదీన అసెంబ్లీ వద్ద ధర్నా చేయనున్నట్లు వెల్లడించారు. సమావేశంలో మున్సిపల్ కార్మిక సంఘం నాయకులు సోమన్న, ఓబులేసు, ప్రతాప్, శివరాం, మస్తాన్, తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ వాడకాన్ని నిర్మూలిద్దాం

దొర్నిపాడు: గ్రామ పంచాయతీల్లో ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా నిర్మూలించేందుకు ప్రణాళికలు రూపొందించాలని ఎంపీడీఓ సావిత్రి సూచించారు.శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఆమె గ్రామ పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను పునరుద్ధరించేలా చర్యలు తీసుకోవాలన్నారు. అర్జునాపురం గ్రామ పంచాయతీలో గ్రౌండ్ ట్రూత్ అండ్ గ్రౌండ్ వాల్యూయేషన్ 36 కాలమ్స్ సర్వే గురించి తగు సూచనలు సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఈఓపీఆర్డీ నాగ అనసూయ పాల్గొన్నారు.

ఫార్మర్ రిజిస్ట్రేషన్ తప్పనిసరి

దొర్నిపాడు: సొంత పొలం కలిగిన ప్రతి రైతు ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారి ప్రమీల శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలో 4,294 మంది రైతులు పీఎం కిసాన్ పొందుతున్నారన్నారు. కానీ, ఇప్పటి వరకు 3,817 మంది మాత్రమే రిజిస్ట్రేషన్ చేసుకున్నారన్నారు.

ఇంటి పన్ను వసూళ్లను వేగవంతం చేయండి

ఉయ్యాలవాడ: గ్రామ పంచాయతీల్లో 2024–25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఇంటి పన్ను వసూళ్లను వేగవంతం చేయాలని కార్యదర్శులకు ఎంపీడీఓ ఉమామహేశ్వరరావు ఆదేశించారు. శుక్రవారం ఆయన కార్యాలయంలో మాట్లాడుతూ మండల పరిధిలోని 20 గ్రామ పంచాయతీల్లో గృహాల సంబంధించి రూ. 12,86,296, అలాగే వ్యాపార సముదాయాలు, గోడౌన్లు, తదితర వాటికి సంబంధించి రూ. 4,06,054 పన్ను వసూలు కావాల్సి ఉందన్నారు. గ్రామాభివృద్ధికి దోహదపడే ఈ పన్ను డబ్బులను మార్చి నెలాఖరులోపు వసూలు చేయాలని చెప్పారు.

విద్యార్థులకు ప్లేట్ల పంపిణీ



ప్లేట్లు పంపిణీ చేస్తున్న దృశ్యం

నంద్యాల(న్యూటౌన్): పట్టణంలోని రామకృష్ణ విద్యాలయంలో చదువుతున్న విద్యార్థులకు మధ్యాహ్న భోజనం తినడానికి ప్లేట్లు తక్కువగా ఉండటంతో 1990–91 బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు వాటిని పంపిణీ చేసినట్లు ప్రధానోపాధ్యాయులు తిరుమలరావు తెలిపారు. రూ.20వేలు విలువ చేసే ప్లేట్లు ఇచ్చామని, భవిష్యత్తులో కూడా పాఠశాలకు సహాయ సహకారాలు అందిస్తామని పూర్వ విద్యార్థులు శరత్‌సెత్, శ్యాందర్‌గుప్త, చంద్రశేఖర్, సుబ్రహ్మణ్యం, నాగరాజు, శ్రీధర్ పేర్కొన్నారు.

ఉద్యోగులను నిరాశపరిచిన బడ్జెట్



సమావేశంలో మాట్లాడుతున్న నగరి శ్రీనివాసులు

నంద్యాల(న్యూటౌన్): రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ఉద్యోగుల వేతన సవరణకు ఎలాంటి నిధులు కేటాయించకపోవడం తీవ నిరాశకు గురి చేసిందని ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర కమిటీ సభ్యులు సాంబశివుడు, జిల్లా ప్రధాన కార్యదర్శి నగరి శ్రీనివాసులు అన్నారు. శుక్రవారం సాయంత్రం ఏపీటీఎఫ్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ 12వ వేతన సవరణకు సంబంధించి రెండు సంవత్సరాలు ఆలస్యమైందని, ఎన్నికల ముందు హామీ ఇచ్చిన కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పట్టించుకోవడం లేదన్నారు. తక్షణమే 30 శాతం మధ్యంతర భృతి ప్రకటించాలని డిమాండ్ చేశారు.

విద్యా రంగాన్ని విస్మరించిన బడ్జెట్

పాఠశాల విద్యకు 30 శాతం నిధులు కేటాయించాలని కొఠారి కమిషన్ చెబితే కూటమి ప్రభుత్వం 10 శాతం కన్నా తక్కువే నిధులు కేటాయించిందని యూటీఎఫ్ నంద్యాల జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పీవీ ప్రసాద్, సుధాకర్ ఆందోళన వ్యక్తం చేశారు. శుక్రవారం ఆ యూనియన్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ ఉద్యోగులకు సంబంధించిన సరెండర్‌లీవ్, పీఆర్సీ, డీఏ తదితరవి పెండింగ్‌లోనే ఉండిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు.

బడ్జెట్‌లో ప్రజా సంక్షేమం ఏదీ?

నంద్యాల(న్యూటౌన్): ఏపీ బడ్జెట్‌లో ప్రజా సంక్షేమానికి గాలికొదిలేశారని, ఎన్నికల హామీల అమలు ఊసెత్తలేదని సీపీఎం పట్టణ కార్యదర్శి లక్ష్మణ్, సీఐటీయూ నాయకులు మహమ్మద్‌గౌస్ అన్నారు. శుక్రవారం వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు సూపర్–6 పథకాలను ప్రకటించి అధికారంలోకి వచ్చిన తర్వాత నేడు, రేపు అంటూ ప్రజలను మోసం చేస్తుందని మండిపడ్డారు. మహిళలకు ఫ్రీబస్సు, నెలకు రూ. 1500, నిరుద్యోగులకు భృతి, ప్రతి ఏటా ఉద్యోగాలు తదితర హామీలను బడ్జెట్‌లో ప్రస్తావించలేదన్నారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పని చేస్తామని ప్రగల్భాలు పలికిన కూటమి నాయకులు నేడు కనీసం రైతులకు పండించిన పంటలకు కూడా గిట్టుబాటు ధర కల్పించలేకపోతున్నారని మండిపడ్డారు. ధరలు పెంచి ప్రజలపై భారాలు వేస్తే చూస్తూ ఊరుకోమని, ప్రజా ఉద్యమాలను చేపడతామని హెచ్చరించారు. సమావేశంలో నాయకులు పుల్లా నరసింహులు, వెంకటలింగం, మౌలాలి, జైలాన్, తదితరులు పాల్గొన్నారు.

సృజనాత్మకతను వెలికితీయాలి

జాతీయ సైన్స్ దినోత్సవంలో వక్తలు



ఉయ్యాలవాడలో సీవీ రామన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు



చాగలమర్రిలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో వైజ్ఞానిక ప్రదర్శన నిర్వహిస్తున్న విద్యార్థినులు



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ ఇంద్రావతి

చాగలమర్రి: విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను గుర్తించి వెలికితీయాలని వక్తలు పేర్కొన్నారు. శుక్రవారం జాతీయ సైన్స్ దినోత్సవాన్ని నంద్యాల, ఆళ్లగడ్డ నియోజకవర్గాల్లోని విద్యాసంస్థల్లో ఘనంగా నిర్వహించారు. శాస్త్రవేత్త సర్.సి.వి.రామన్ చిత్రపటానికి అధ్యాపకులు, ఉపాధ్యాయులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రతి విద్యార్థి సీవీ రామన్‌ను స్ఫూర్తిగా తీసుకొని పరిశోధనలు చేయాలని చాగలమర్రి జిల్లా పరిషత్ బాలుర, బాలికల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసులు, విజయలక్ష్మి, శ్రీచైతన్యభారతి, కేజీబీవీ ఎస్ఓ సునీత, అజీం బ్రిల్లియంట్ ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు డి.మహమ్మద్‌రఫీ, గౌసులాజం సూచించారు. ఆయా పాఠశాలల్లో సైన్స్ డేను పురస్కరించుకుని వైజ్ఞానిక ప్రదర్శన నిర్వహించారు.

ప్రతి విద్యార్థి శాస్త్రవేత్తగా ఎదగాలి

ఉయ్యాలవాడ: సర్‌సీవీ రామన్‌ను ఆదర్శంగా తీసుకు ని ప్రతి విద్యార్థి శాస్త్రవేత్తగా ఎదగాలని హెచ్ఎం మహబూబ్‌షరీఫ్ పిలుపునిచ్చారు. శుక్రవారం మండలంలో ని మాయలూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని సీవీ రామన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా హెచ్ఎం మాట్లాడుతూ భౌతిక శాస్త్రంలో సీవీ రామన్ అపారమైన పరిశోధనలు చేసి నోబెల్ బహుమతి పొంది మొదటి భారతీయ శాస్త్రవేత్తగా గుర్తింపు తెచ్చుకున్నారన్నారు. నివాళులర్పించిన వారిలో ఉపాధ్యాయులు,సిబ్బంది ఉన్నారు.

శిరివెళ్ల: మండలంలో శుక్రవారం జాతీయ సైన్స్ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. యర్రగుంట్ల జీటీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల, మోడల్ స్కూల్లో ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టారు. జీటీఆర్ కాలేజీలో జరిగిన సైన్స్‌డేలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఇంద్రావతి మాట్లాడుతూ ప్రతి ఏటా ఫిబ్రవరి 28వ తేదీన జాతీయ సైన్స్ డే జరుపుకుంటున్నామన్నారు. భారతీయ శాస్త్రవేత్తల పరిశోధన ప్రతిభను అంతర్జాతీయ స్థాయిలో ఇనుమడించిన శాస్త్రవేత్తల్లో సీవీ రామన్ అగ్రగణ్యుడన్నారు. సత్యం యొక్క మరో ముఖం సైన్స్ అని చెప్పారు. మోడల్ స్కూల్లో జరిగిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఇష్రత్‌బేగం పాల్గొని మాట్లాడారు.

గురురాజలో ఇంట్రా స్కూల్ సైన్స్ ఎక్స్‌పో

నంద్యాల(న్యూటౌన్): జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని పట్టణంలోని శ్రీ గురురాజ ఇంగ్లిష్ మీడియం పాఠశాలలో శుక్రవారం ఇంట్రా స్కూల్ సైన్స్ ఎక్స్‌పో–2025 నిర్వహించారు. డైరెక్టర్ షేక్షావలిరెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా చైర్మన్ పెద్దిరెడ్డి దస్తగిరిరెడ్డి, డాక్టర్ రామకృష్ణారెడ్డి, మార్క్‌ఫెడ్ డైరెక్టర్ తులసిరెడ్డి, మౌలాలిరెడ్డి హాజరై భారతరత్న సర్ సీవీ రామన్ చిత్రపటానికి పూలమాలలు వేసి జ్యోతి ప్రజ్వలన చేశారు. ఎగ్జిబిషన్‌లో సైన్స్, సోషల్ విభాగంలో 400కు పైగా ప్రాజెక్టులను విద్యార్థులు తయారు చేసి ప్రదర్శించారు. ఇందులో రాకెట్ ప్రదర్శన ప్రత్యేకంగా నిలిచింది. రామకృష్ణ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన జాతీయ సైన్స్ దినోత్సవంలో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రీజనల్ మేనేజర్ సూర్యప్రకాష్ పాల్గొని సైన్స్‌పై ఆసక్తి పెంచుకోవాలని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ రామకృష్ణారెడ్డి, హేమంత్‌రెడ్డి, ప్రగతిరెడ్డి, విజయకాంత్ పాల్గొన్నారు.

కొనసాగుతున్న విచారణ

రుద్రవరం: మండలంలో ఉపాధిహామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్లు, మేట్లపై విచారణ పర్వం కొనసాగుతోంది. కూటమి ప్రభుత్వం వచ్చాక అనుకూలమైన వారిని నియమించుకునేందుకు పాత వారిని తొలగించేందుకు ఇలాంటి చర్యలు చేపడుతున్నారనే విమర్శలు ఉన్నాయి. ఇప్పటికే మండలంలో పలువురు ఫీల్డ్ అసిస్టెంట్లపై విచారణ సాగింది. తాజాగా మండలంలోని కొండమాయపల్లెలోని శ్రీనగర్‌కు చెందిన సీనియర్ మేట్ రామసంజమ్మను శుక్రవారం ఏపీడీ సాంబశివరావు విచారించారు. ఉపాధి కూలీలపై దుర్భాషలాడుతుందని, అడిగిన వారికి జాబ్ కార్డు ఇవ్వడం లేదని వంటి ఫిర్యాదులు అందడంతో రామసంజమ్మపై విచారణ చేస్తున్నట్లు ఏపీడీ తెలిపారు.

భక్తిశ్రద్ధలతో..



దర్గాను దర్శించుకుంటున్న భక్తులు

శిరివెళ్ల: మండలకేంద్రం శిరివెళ్లలో వెలసిన శ్రీ హజరత్ షానేషావలి ఉరుసు శుక్రవారం కనుల పండువగా జరిగింది. కుల మతాలకు అతీతంగా భక్తులు తరలి వచ్చి స్వామికి ప్రత్యేక ఫాతెహాలు చదివించారు. వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు బి. అబ్దుల్ సలాం, జెడ్పీ వైఎస్ చైర్మన్ దిల్షాద్ బేగం, ఏంపీపీ నాయక్ వసీం, సర్పంచు సాలమ్మలు స్వామి దర్గాను దర్శించుకున్నారు. ఉరుసుకు వచ్చిన భక్తులకు అన్నదానం చేశారు.

నిధుల కేటాయింపుపై స్పష్టత కరువు

చాగలమర్రి: 12వ పీఆర్సీ, ఐఆర్ అమలుకు అవసరమైన నిధుల కేటాయింపుపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వలేదని ఎస్టీయూ మండల శాఖ అధ్యక్షుడు జి.మస్తాన్‌బాషా, ప్రధాన కార్యదర్శి సుబ్బారావు అన్నారు. సీపీఎస్/జీపీఎస్ కన్నా మెరుగైన పెన్షన్ విధానాన్ని అమలు చేస్తామని హామీ ఇచ్చి పట్టించుకోవడం లేదన్నారు. అలాగే బడ్జెట్‌లో పాఠశాల విద్యకు గత ప్రభుత్వం 2023–2024లో 10.15% నిధులు కేటాయించగా ప్రస్తుత బడ్జెట్‌లో 9.86% నిధులు మాత్రమే కేటాయించారన్నారు. విద్యారంగంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని మోడల్‌గా తీర్చిదిద్దుతామని ప్రకటించిన కూటమి ప్రభుత్వం ఆచరణలో చూపించడం లేదని ఆర్థిక కార్యదర్శి మహబూబ్‌హుసేన్, అదనపు కార్యదర్శి పి.శివశంకర్‌ఖ పేర్కొన్నారు.

చిన్న చూపు చూడొద్దు

నంద్యాల(న్యూటౌన్): శ్రీవెంకటేశ్వర పశువైద్య విద్యార్థుల పట్ల చిన్న చూపు సరికాదని, వారి డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి నాగరాముడు డిమాండ్ చేశారు. శుక్రవారం ఆ సంఘం ఆధ్వర్యంలో విద్యార్థులు కలెక్టర్ కార్యాలయంలో డీఆర్ఓ రామునాయక్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఫిబ్రవరి 3వ తేదీ నుంచి తరగతులను బహిష్కరించి సమ్మె, నిరాహార దీక్షలు చేపడుతున్నామన్నారు. ఇంటర్న్‌షిప్ చేసే సమయంలో ఇచ్చే స్టయిఫండ్ రూ.25వేల నుంచి రూ.65వేలకు పెంచాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ కార్యదర్శి విష్ణువర్ధన్, పాములేటి, ఎర్రిస్వామి, తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం విఫలం



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

నంద్యాల(న్యూటౌన్): ఆశా వర్కర్లు, కార్మికుల సమస్యలను పరిష్కరించడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందని ఏపీ ఆశా వర్కర్స్ యూనియన్ సీఐటీయూ జిల్లా గౌరవాధ్యక్షుడు ఏసురత్నం, జిల్లా అధ్యక్షురాలు నాగమణి, ప్రధాన కార్యదర్శి రమణ కుమారి ధ్వజమెత్తారు. శుక్రవారం స్థానిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ ఆశా వర్కర్లకు కనీస వేతనాలు చెల్లించాలని, కమ్యూనిటీ హెల్త్ వర్కర్లను ఆశా వర్కర్లుగా మార్పు చేయాలని, ప్రభుత్వ సెలవులు, క్యాజువల్ లీవ్‌లు, వేతనంతో కూడిన మెటర్నటీ లీవ్, పదవీవిరమణ వయో పరిమితి 62 సంవత్సరాలకు పెంపు, తదితర ఒప్పంద జీఓలకై మార్చి 6న విజయవాడలో భారీ ధర్నా చేయనున్నట్లు తెలిపారు. పీఎంజేజేబీవై వర్తింపజేస్తామని చెప్పిన ప్రభుత్వం ఇంత వరకు పట్టించుకోవడం లేదన్నారు. కేంద్రంలోని మోడీ ప్రభుత్వం కూడా కార్మిక హక్కులను హరించివేస్తుందని, పోరాడి సాధించుకున్న చట్టాలను నిర్వీర్యం చేస్తుందన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరిస్తూ ప్రజా ధనాన్ని కార్పొరేట్ శక్తులకు అప్పగిస్తుందని మండిపడ్డారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల తీరుపై ఐక్య ఉద్యమాలకు శ్రీకారం చుడతామన్నారు. సమావేశంలో ఆశా వర్కర్స్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

శ్రీకాళికాంబదేవికి ప్రత్యేక పూజలు

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలోని గాంధీచౌక్‌లో వెలసిన కాళికాంబ చంద్రశేఖరస్వామి దేవస్థానంలో శుక్రవారం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారి మూల విరాట్‌కు ఉదయం సుప్రభాతసేవ, పంచామృతాభిషేకం అనంతరం వివిధ రకాల పూజలు నిర్వహించి అమ్మవారిని పూలతో ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యాన్ని కల్పించారు. ఒడి బియ్యం కార్యక్రమం చేపట్టి రాహుః కాల పూజలు చేశారు. సాయంత్రం అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని ప్రత్యేకంగా అలంకరించిన పల్లకీలో ఆశీనులు గావించి ఆలయ ప్రాకారంలో ప్రదక్షిణలు చేపట్టారు. చివరగా నవవిధ హారతులు ఇచ్చి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం కాళీమాత సేవా సమితి ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఈఓ లక్ష్మీనారాయణ, దేవస్థానం చైర్మన్ ఆరవేటి వాసు, విజయ్‌కుమార్, నరసింహ, అంబరేష్, అర్చకులు సుబ్బాచారి, రాఘవేంద్రాచారి, సుబ్రహ్మణ్యం శాస్త్రి తదితరులు పాల్గొన్నారు.

100శాతం ఈ కేవైసీ చేయించుకోవాలి

నంద్యాల(అర్బన్): ప్రతి రైతు తన పొలాన్ని ఈ పంటలో నమోదు చేయాలని, వందశాతం ఈకేవైసీ జరిగేలా వీఏఏలు కృషి చేయాలని మండల వ్యవసాయాధికారి ప్రసాదరావు సూచించారు. మండలంలోని కొత్తపల్లి, అయ్యలూరు, పొన్నాపురం రైతు సేవా కేంద్రాల్లో ఈ పంట నమోదు, ఈకేవైసీ కార్యక్రమాలను శుక్రవారం ఆయన పర్యవేక్షించారు. అనంతరం ఏఓ మాట్లాడుతూ 2024 రబీకి సంబంధించి మండలంలో 14180.5 ఎకరాల్లో పంట నమోదు చేయగా 81 శాతం ఈకేవైసీ జరిగిందన్నారు. ప్రతి రైతు పంట నమోదు చేసుకుంటేనే పంట నష్ట పరిహారం, ఇన్సూరెన్స్, మద్దతు ధరపై దిగుబడుల కొనుగోలు ఉంటాయన్నారు.

ఘనంగా వరల్డ్ టైలర్స్ డే

నంద్యాల(న్యూటౌన్): పట్టణంలోని ఎన్‌టీఆర్ షాదీఖానాలో శుక్రవారం వరల్డ్ టైలర్స్ డేను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మార్క్‌ఫెడ్ డైరెక్టర్ తులసిరెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలోని టైలర్లందరికీ ఇంటి స్థలాలు, కమిటీ హాల్, 50 సంవత్సరాలు పైబడిన వారికి పింఛన్లు మంజూరు చేసేందుకు కృషి చేస్తానన్నారు. టైలర్స్ అసోసియేషన్ నాయకులు సుభాన్, నంద్యాల టౌన్ అధ్యక్షుడు శేఖర్, గౌరవాధ్యక్షుడు షఫీవుల్లా మాట్లాడుతూ న్యాయమైన టైలర్ల సమస్యలపై ప్రభుత్వం పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో టైలర్ సంఘం నాయకులు శేఖర్, ముల్లాఖాన్, రవికుమార్, మహమ్మద్‌రఫీ, కరీం, ఆనంద్, పాల్గొన్నారు.

ఉపాధి సిబ్బందికి నోటీసులు

నంద్యాల(అర్బన్): ఉపాధి హామీ పథకానికి సంబంధించిన 77మంది టెక్నికల్ అసిస్టెంట్లు, 13మంది ఏపీఓలకు శుక్రవారం పీడీ వెంకటసుబ్బయ్య నోటీసులు జారీ చేశారు. విధుల్లో నిర్లక్ష్యం, కూలీలకు రోజువారీగా రూ.300 అందకపోవడం, పనులకు వచ్చే కూలీల సంఖ్య తగ్గిపోవడం తదితర కారణాలు చూపారు. జిల్లాలోని ఆళ్లగడ్డ, బండిఆత్మకూరు, చాగలమర్రి, కొత్తపల్లి, శిరివెళ్ల, బేతంచెర్ల, రుద్రవరం, బనగానపల్లె, అవుకు, డోన్, ఆత్మకూరు, పగిడ్యాల, గడివేముల మండలాలకు చెందిన ఏపీఓలతో పాటు 77మంది టెక్నికల్ అసిస్టెంట్లకు ఈ నోటీసులు జారీ అయ్యాయి.